క్లుప్తంగా

సబ్‌ట్రెజరీ కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జగన్నాథరావు

మార్కాపురం: మార్కాపురం సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సోమవారం జిల్లా ట్రెజరీ అధికారి జగన్నాథరావు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జనవరి, ఫిబ్రవరిలో పెన్షనర్ల బయోమెట్రిక్ తీసుకోవాలని సబ్ ట్రెజరర్ కెనడీకి సూచించారు.

'మీ కోసం' భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం: మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రూ.55 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న 'మీ కోసం' భవన నిర్మాణానికి సోమవారం సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నారాయణరావు, సీఐ సుబ్బారావు, తహసీల్దార్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన విద్యార్థులు



పీహెచ్‌సీలో సేవల తీరును వివరిస్తున్న డాక్టర్ కావ్య

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు ఒకేషనల్ హెల్త్‌కేర్ ట్రైనర్ ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. పీహెచ్‌సీలో ఓపీ కౌంటర్, ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేసే విధానం, మెడిసిన్ పంపిణీ, జనరల్ వార్డు సేవల గురించి వైద్యాధికారి కావ్య వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ కిశోర్‌కుమార్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ శిరీష, ఉపాధ్యాయులు, సీహెచ్‌ఓ హబీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్లో మూడు నెలల పాటు నైపుణ్య శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ టి.ఎ.నందన్ బాబు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన యువత టెలీ కమ్యూనికేషన్, ఎలక్ట్రీషియన్ హెల్పర్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ తదితర కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ ఒకటో తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8019311043ను సంప్రదించాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేధం

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘ పరిధిలో బహిరంగ మల, మూత్ర విసర్జనను నిషేధిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, పొదుపు సంఘాల మహిళలు, వార్డు సభ్యులతో కలిసి బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన రహిత పురపాలక సంఘంగా తీర్మానించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.500, 10 రోజుల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. తీర్మానంపై అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోగా పురపాలక సంఘ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించాలి

మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 పోటీల్లో మెరుగైన ర్యాంకుల సాధన కోసం పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. తడి, పొడి చెత్తను నివాసాల వద్దనే విభజించి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు.


'మానవత' కార్యాలయానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న దాతలు, సభ్యులు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం దర్శి రోడ్డులోని డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో శంకుస్థాపన చేశారు. స్థల దాతలు శ్రావణి వెంకటేశ్వర్లు, విజయగౌరి, మొదటి ఫ్లోర్ నిర్మాణ దాతలు, ఏపీఆర్ గ్రూపు సంస్థల అధినేత ఆవుల కృష్ణారెడ్డి తల్లిదండ్రులు, ఓబులక్కపల్లి సర్పంచ్ ఆవుల వెంకట సుబ్బారెడ్డి, తిరుపతమ్మ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ మువ్వల పార్థసారధి, కె.యల్లమందారెడ్డి, డైరెక్టర్లు కల్లం వెంకట సుబ్బారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, యక్కలి శేషగిరిరావు, సామంతపూడి నాగేశ్వరరావు, షేక్.రసూల్, వై.వెంకటేశ్వర్‌రెడ్డి, బండి అశోక్, బాజీ కరీముల్లా, బెల్లంకొండ విజయలక్ష్మి, వరికూటి శిరీష, జి.శ్రీనివాసులు, జీసీ సుబ్బారావు, మాగులూరి రామయ్య, సోమిశెట్టి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.





అర్ధనారీశ్వరుడిగా జగదాంబ అమ్మవారు, మార్కండేశ్వరస్వామి



ఎదుర్రాళ్లపాడులో ప్రత్యేక అలంకరణలో శివలింగం



కేతగుడిపిలో పూజలు చేస్తున్న అన్నా రాంబాబు

భక్తి శ్రద్ధలతో కార్తీక మాస పూజలు

కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి ప్రీతికరమైన అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించారు.



పొదిలి : సహస్ర దీపారాధనలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్/కొనకనమిట్ల/తర్లుపాడు/పొదిలి: స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగదాంబ అమ్మవారు అర్ధనారీశ్వర రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, పలువురు నాయకులు, అధికారులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొనకనమిట్ల మండలంలో గొట్లగట్టు, కొనకనమిట్ల, రేగడపల్లి, పెదారికట్ల, ఎదురాళ్లపాడు, చినారికట్ల, బ్రాహ్మణపల్లి, సలనూతల, అంబాపురం గ్రామాలలోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. తర్లుపాడు మండలంలోని కేతగుడిపిలో ప్రసిద్ధిగాంచిన కేదారేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు రుద్రాభిషేకం చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు సర్పంచ్ పెద్దమస్తాన్, కోటిరెడ్డి మల్లారెడ్డి, రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు. పొదిలి విశ్వనాథపురంలోని కాలేజీ రోడ్డులో సీతారామచంద్ర ఆలయం వద్ద సహస్ర దీపారాధన ఉత్సవం శోభాయమానంగా సాగింది. ఆలయ దాతలు వేంపాటి పోలిరెడ్డి, సామి రాజా పర్యవేక్షణలో మహిళలు దీపాలు వెలిగించారు.

వైభవంగా మహా పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

పొదిలి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ పీఠం ఆధ్వర్యంలో మహాపడి పూజ, అగ్ని గుండ ప్రవేశాలు, స్వామి వారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. కలశ ఉభయదాత బొర్రా శ్రీనివాసరావు తదితరులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్‌రావు, జి.చెన్నారెడ్డి, జి.సుబ్బారావు, కాటూరి ప్రసాదు తదితరులు పూజా కార్యక్రమాలకు పర్యవేక్షించారు.

డాక్టర్ వంశీకి ఐఎంఏ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వంశీకృష్ణ

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్ ఈఎన్‌టీ వైద్యుడు కొల్లా వంశీకృష్ణ ఇండియన్ మెడికల్ అసోషియేషన్ అవార్డును ఆదివారం రాత్రి గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ జాతీయ అధ్యక్షుడు ఏఆర్ అశోకన్ నుంచి అందుకున్నారు. వంశీకృష్ణ మార్కాపురం పట్టణ ఐఎంఏ అధ్యక్షుడిగా పనిచేస్తూ సంస్థ తరఫున మెడికల్ క్యాంపులు, సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సంజయ్, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.మాధవరావు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం మండల యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక



నూతన అధ్యక్ష కార్యదర్శులు జయరామిరెడ్డి, రాజేష్

మార్కాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల మహాసభను మార్కాపురం మండల శాఖ అధ్యక్షులు పి.అల్లూరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెన్నా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమ నేతలు దాచూరి రామిరెడ్డి, అప్పారి వెంకటస్వామి, మైనేని వెంకటరత్నం, చెన్నుపాటి లక్ష్మయ్య త్యాగాల ఫలితంగా ఉపాధ్యాయులు ఈనాడు అనేక రాయితీలు పొందుతున్నారన్నారు. జిల్లా కార్యదర్శి, ఎన్నికల పరిశీలకులు ప్రభాకర్ మాట్లాడుతూ.. 117 జీవోను రద్దు చేయాలని, బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా జి.గురుస్వామి, కె.నాగరాజు, వై.సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా అల్లూరిరెడ్డి, అధ్యక్షుడిగా జయరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా వి.రాజేష్, కోశాధికారిగా రామకృష్ణ, మహిళా కార్యదర్శులుగా విశ్వజ్యోతి తదితరులను, మార్కాపురం మండల కుటుంబ సంక్షేమ పథక కన్వీనర్‌గా పిచ్చయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా బాలనాగయ్య



బాలనాగయ్య

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలని, నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీని అమలుచేయాలని సీపీఎం మండల కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన గుమ్మా బాలనాగయ్య కోరారు. సోమవారం సీపీఎం నిర్వహించిన మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా టి ఏడుకొండలు, ఎం.బాలశేషయ్య, జె.నాగరాజు, జి.రాజశేఖర్‌రెడ్డి, పి.లక్ష్మయ్య, వై.పాపరెడ్డిని ఎన్నుకున్నారు. గుండ్లకమ్మపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని, గజ్జలకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించాలని, మార్కాపురంలో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, గొర్రెలు, మేకల పెంపకందారులపై అటవీ అధికారుల దాడులను నివారించాలని డిమాండ్ చేశారు.

త్రోబాల్ పోటీల్లో బాలికల ప్రతిభ



త్రోబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: చందలూరులో శుక్రవారం నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.వీరదీప, రత్నకుమారి, డి.రహీనా, నాగశ్వేత, భార్గవియాదవ్ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 29, 30వ తేదీల్లో చిత్తూరు జిల్లా పూతలపట్టులో, డిసెంబర్ 14, 15న గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ గుర్రం శోభన్‌బాబు తెలిపారు. వీరిని హెచ్‌ఎం నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థి దశలో జాగ్రత్తగా ఉండాలి



మర్రిపాలెంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఐ

కొనకనమిట్ల: విద్యార్థులు పెడదోవ పడితే జీవితంలో ఇబ్బందులు తప్పవని ఎస్సై టి.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మర్రిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్‌పై బాలికలకు వివరించి భరోసా కల్పించారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కంభం ఎంఈఓ–2



ఎంఈఓ-2ను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

కంభం: మండలం విద్యాశాఖాధికారి-2గా టి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కంభం ఎంఈఓ-2గా విధులు నిర్వహిస్తున్న శార్వాణి మార్కాపురం బదిలీ కాగా, మార్కాపురంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఇక్కడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈఓ-1 మాల్యాద్రి, హెచ్‌ఎంలు బైసాని రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎంపీడీఓను నిలదీస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

- తర్లుపాడులో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల డిమాండ్
- అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- సర్వసభ్య సమావేశం బహిష్కరణ

తర్లుపాడు: పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు ఎంపీడీఓ చాంబర్ వద్దకు చేరుకుని నిధుల విడుదలలో జాప్యంపై నిలదీశారు. నిధులు విడుదలై 3 నెలలు గడిచినప్పటికీ నేటికీ బిల్లులు చెల్లించకపోవడానికి గల కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యం, అభివృద్ధికి రూ.లక్షల్లో సొంత నిధులు ఖర్చు చేశామని, గ్రీన్ అంబాసిడర్ల వేతనం ఆరు నెలలకు పైగా పెండింగ్‌లో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఎందుకు బిల్లులు చేయకుండా ఆపుతున్నారో చెప్పాలని పట్టుబట్టారు. దీంతో కొంత ఉద్రిక్తత వాతావారణం ఏర్పడింది. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ హామీ ఇవ్వడంతో ప్రజాప్రతినిధులు శాంతించారు. అనంతరం సర్వసభ్య సమావేశానికి హాజరై ఇటీవల మృతి చెందిన చెన్నారెడ్డిపల్లి సర్పంచ్ మురారి సుబ్బమ్మ, మంగళకుంట సర్పంచ్ పిన్నిక శారదకు నివాళులర్పించారు. వెనువెంటనే సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఎంపీపీ, ఎంపీడీఓకు అర్జీ అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం టౌన్: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండి, నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకూ వివరించాలని ఎస్సైలు సైదుబాబు, రామోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం, మహిళలపై జరుగుతున్న నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సైలు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశలో తెలిసీ తెలియక మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని పాడుచేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు. సైబర్ క్రైమ్ బారిన పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులు, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలని, ఉన్నతమైన లక్ష్యాలతో సన్మార్గంలో నడవాలని హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: మీకోసం కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలను అధికారులు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపారు. తమ గ్రామంలో కుళాయిల ద్వారా నీరు వస్తున్నాయని, ట్యాంకర్లతో నీటి సరఫరాను నిలిపివేయాలని మార్కాపురం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన ఎం.కాశయ్య కోరారు.